13

# మధ్యతరగతి మందహాసం

ఎవరదీ– ఉగాదీ నువ్వేనా!

కొమ్మల్లో కోయిల కూస్తూంటే,

మా పెరటి రెమ్మల్లో మల్లియ పూస్తూంటే,

ఈ మధుమాసోదయవేళ,

ఉగాదీ నిన్ను పోల్చుకున్నానులే,

చిగురేస్తే.. మొగ్గేస్తే... సొగసంతా పూతపూస్తే...

కోయిల గొంతు విన్న సుమిత్ర పెదవులపైన ఈ కవిత అప్రయత్నంగా కదిలింది. ఆ కవితని ఎవరు రాశారో తెలీదు. కానీ కోయిల 'కూ' అన్నప్పుడల్లా 'ఎవరదీ' అంటూ మొదలు పెట్టి పాడుకుంటుంది.

"సుమిత్రా ఆ కాఫీ ఎంతసేపు తాగుతావ్? తొందరగా తాగేసి వస్తే, గది సర్దేయచ్చు... గమ్మున రావాలి.."

భర్త రాజారావు మాటలు విన్న సుమిత్ర ఈ లోకంలోకి వచ్చి, కళ్ళు తెరిచింది. ఎదురుగా ఉన్న రాజారావుని చూసి 'అలాగే' అన్నట్లు తలూపింది.

కొడుకు రాఘవ, కోడలు వనజ, మనవలు రెండు రోజుల్లో వస్తున్నారు. అందుకని గదిని సర్దడానికి సిద్ధం అయ్యారు సుమిత్ర, రాజారావులు.

సుమిత్ర ఆలోచనలో పడింది. కొడుకు మాటలు చెవుల్లో గింగురు మంటున్నాయి.

"ఈ ఇంట్లోనా! మేమా! ఉండడమా! నీకేమయినా మతిపోయిందా? ఎలా ఉంటాం అని నువ్వనుకున్నావ్?" అన్న రాఘవ వస్తున్నాడు.

"మీరిద్దరూ, మేం నలుగురం మొత్తం ఆరుమంది... ఈ రెండు పడగ్గదుల ఇంట్లో, కన్నాల్లోంచి బయటికొచ్చే ఎలుకల్లా బిలబిలమంటూ అటూ ఇటూ తిరుగుతూ, ఒకళ్ళకొకళ్ళు ఎదురుపడ్తూ, తలలూ మొహాలూ ఢీకొట్టుకుంటూ, ఒళ్ళు తగులుకుంటూ, రాసుకుంటూ, బొత్తిగా ప్రైవెసీ అన్నది లేకుండా..." అన్న రాఘవ పిల్లలతో సహా ఉండడానికొస్తున్నాడు.

"అంతమంది ఉండేవాళ్ళం, ఇంత మంది ఉండే వాళ్ళం అంటూ ఫ్లాష్ బ్యాక్‌లోకి వెళ్ళి నీ చిన్నప్పటి సంగతులు చెప్పకమ్మా. అయినా, మాకు ఇల్లు చూడమని మా స్నేహితులకి చెప్పాను.

"హైదరాబాద్‌కి బదిలీ అయింది అన్న కొడుకుతో అందరం కలిసే ఉందాం అని అన్నదానికి రాఘవనుంచి వచ్చిన సమాధానాలు ఒక్కొక్కటి గుర్తొచ్చాయి.

"సర్దుకోడమా! ఏం మాట్లాడుతున్నావమ్మా! సర్దుకోడం ఏంటి? అసలెలా సర్దుకుంటాం! పోనీ ఓ రోజో, రెండు రోజులో అంటే అనుకోవచ్చు. ఏమో ఎన్ని ఏళ్ళో మాకే తెలీదు. పైగా ఈ సర్దుకోడంలో ఏదో సేవ్ చేసెయ్యచ్చు అని అనుకుంటున్నావులా వుంది. నీదంతా మిడిల్‌క్లాస్ మెంటాలిటీ..." అని తన మాటల్ని కొట్టిపారేసిన రాఘవ, ఈ మధ్యతరగతి రెండు పడగ్గదుల ఫ్లాటులో సర్దుకుపోతూ ఉండడాని కొస్తున్నాడు.

రెండేళ్ళ క్రితం హైదరాబాద్ వచ్చిన రాఘవ, అప్పుడు ఈ మిడిల్ క్లాస్ ఏరియాలో, మిడిల్ క్లాస్ మనుషులతో ఉండడానికిష్టపడని రాఘవ, పెళ్ళాం పిల్లల్తో వస్తున్నాడు. ఆ సంగతి పదిహేను రోజుల క్రితం ఆదివారంనాడు తెలిసింది.

"నాలుగు నెల్లనుంచి, మాకు సరిగ్గా జీతాలు రావడంలేదు. ఇంటికి అన్ని లక్షలు లోన్ తీసుకున్నాం. ఇల్లు బిల్డర్ ఇవ్వలేదు. పైగా ఇంకో ఏడాది పడ్తుందని అన్నాడు. ఈ సమయంలో అంతంత అద్దె ఇచ్చుకుంటూ ఆ ఇంట్లో ఉండలేం.

మేము ఇక్కడికి వచ్చి ఉంటాం.... ఈ రెండు నెలలు పిల్లలు అక్కడే చదువుతారు. ఆ తర్వాత, పక్క వీధిలో ఉన్న పబ్లిక్ స్కూల్లో చేర్పించాలని అనుకుంటున్నాం. మాకు, ఆఫీసులు దూరమే కానీ.. సద్దుకుంటాం... తప్పదు.. వడ్డీలు కట్టడానికైనా మిగిల్చాలి."

'సద్దుకుంటాం' అన్న పదం కొడుకు నోట విన్నాక ఆశ్చర్యం అనిపించింది. దేనికో దానికి గిలగిలా కొట్టుకుంటేనే కానీ, సద్దుకోవడం అన్నమాటకి విలువ తెలీలేదా వీడికి!

సుమిత్రకి ఇంకో భయం కూడా ఉంది. తనకీ కోడలుకి మధ్య ఏవైనా రాపిడి పుడ్తుందా!

అదే రాజారావుతో అంది.

"వనజ, నీ చేతుల్లో పెరిగిన నీ క్లోన్ కాదు. పరాయి పిల్ల. వేరే వాతావరణంలో, వేరే మనుషుల మధ్య పెరిగిన అమ్మాయి. అంతే కానీ, నీకు నచ్చినట్లుగా, నువ్వు కోరుకున్నట్లుగా, నువ్వు కావాలనుకున్నట్లుగా ఈ ఇంట్లో ఉంటుందని అనుకోకు. మొదట్లో మీ ఇద్దరి మధ్య దూరాలు, సరిహద్దులూ ఉండడానికి ఛాన్స్ ఉంది. రాన్రాను అన్నీ తరిగిపోయి ఇంట్లో మనిషిలాగా ఉంటుంది.

అయినా, సుమిత్రా ఇంకో విషయం నువ్వు పెద్దదానివి అని అనుకుంటే. ఏవీ పట్టించుకోకు. అప్పుడు ఈగో ప్రాబ్లెంస్ రావు. అబ్బే లేదు - కాదు - నేనూ వనజా సమానం అని అనుకుంటే ప్రతీ నిమిషం టీవిలో వచ్చే సీరియళ్ళల్లాగా ఉంటుంది.

నేను రిటైరయ్యాను. నువ్వు ఇచ్ఛాపూర్వకంగా ఉద్యోగ విరమణ చేశావు. మన జీవితాల్లో ప్రశాంతత ఉండాలంటే, అది మన చేతుల్లో ఉంది. అదే పెద్దరికంగా ప్రవర్తించడం. ఇది ఎవరి జీవితమో కాదు. మన జీవితం..."

గది అంతా సద్దేశారు సుమిత్రా రాజారావులు. అలిసిపోయిన సుమిత్ర ముందు గదిలో ఉన్న పొడుగు సోఫాలో వాలి, ఓ కుషన్ని తలకిందకి సద్ది కళ్ళు మూసుకుంది. రాఘవ వనజల గురించి ఆలోచిస్తోంది.

రాఘవ ఈ తరంవాడు. ఈ తరం వాళ్ళలాగే డబ్బు కోసం సముద్రాలు దాటాడు. డబ్బుకోసం పరిగెత్తాడు. పరిగెత్తి పాలు తాగడానికి ప్రయత్నించాడు.

ఈ తరం వాళ్ళదంతా ఛానెళ్ళ సంస్కృతి. ఇది వీళ్ళ జీవితాల్లోని సహజత్వాన్ని ఓ పక్కకి నెట్టేసింది. స్వాతంత్ర్యం వచ్చాక, జరిగిన మార్పుల్లో ఈ శాటిలైట్ కమ్యూనికేషన్ మాత్రమే వీళ్ళకి తెలుసు. ఇంకేం తెలీదు.

పోనీ ఆ టీవీలు చూసి ఏవైనా నేర్చుకున్నారా అంటే అదీ లేదు. దేశ చరిత్రే తెలీదు. పార్టిషన్ తెలీదు. ఎమర్జెన్సీ తెలీదు. గురజాడ అంటే ఎక్కడో విన్నట్లుందే ఈ ఊరిపేరు... ఇది వీళ్ల జ్ఞానం!

రాజారావు కాఫీ కలిపి సుమిత్రని లేపాడు. గబుక్కున లేచింది.

"నిద్రపోలేదు... ఊరికే ఆలోచిస్తున్నా... ముందురోజులెలా ఉంటాయా!" నవ్వాడు రాజారావు.

"వేస్ట్... నీ ఆలోచనలన్నీ వేస్ట్. అయినా రాఘవ వనజలు ఇదివరకటి వాళ్ళు కారు. అప్పుడు ఉద్యోగాలు, జీతాలు ఇచ్చిన మత్తు ఇప్పుడు లేదు. మొన్న సామాను అమ్మించడానికి వెళ్ళాను కదా వాళ్ళింటికి. అప్పుడు గమనించాను. ఇద్దర్నీ... వాళ్ళిప్పుడు పరాజితులు... అందుకని నువ్వు పాజిటివ్‌గానే ఆలోచించు." సుమిత్ర మనసు కొంచెం తేలికయింది, భర్త మాటలు విన్నాక.

ఖాళీగా ఉన్న ఆ గదిలో, రాఘవ, వనజ చెరో గోడకి చేరబడి కూచున్నారు. వాళ్ళ మధ్య నిశ్శబ్దం. ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు. చాలా సేపటికి రాఘవ అన్నాడు.

"ఇన్నాళ్ళూ, మన ఉద్యోగాలు మన డబ్బు మాట్లాడాయి. అందుకేనేమో, మాటల్రావడం లేదు. తడుముకోవాల్సొస్తోంది మాట్లాడ్డానికి.

ఇంతవరకూ అనుభూతులుండేవి. అవి జ్ఞాపకాలుగా మారిపోయి, కుక్కల్లా వెంటబడ్తున్నాయి.

రాత్రింబవళ్ళూ ప్రాజెక్టులు, టార్గెట్, పని, విదేశ ప్రయాణాలు, విస్కీ, బీర్‌తో వీకెండ్ పార్టీలు, హిపోక్రెసీ... వీటన్నింటికీ మన ఆరోగ్యాన్ని పణంగా పెట్టాం. ఇదిగో రోగులుగా, మానసిక రోగులుగా మిగిలిపోతున్నాం.

మన మనసుల్ని చిత్తు కాగితాల్లోల్లాగా నలిపేసుకున్నాం. మన విషాదాలు కూడా భరించే టైం మనకుండేది కాదు, ఆ రోజులు అలా ఉన్నాయి..." అంటూంటే రాఘవ గొంతు జీరపోయింది.

వనజ కొంచెం జరిగి రాఘవకి ఎదురుగా కూచుంది.

"అంతేనా! మనకి తెలీకుండా జరిగిన విషాదాలెన్నో... నాకీమధ్యే తెలిసింది... మన పెళ్ళయి పదేళ్ళయింది. ఏ రోజైనా మన జీవితాల్లోని కష్టం సుఖం మాట్లాడుకున్నామా! పాపం పుణ్యం మాట్లాడుకున్నామా! అసలు అవి మాట్లాడుకునేంత తీరిక ఉందా! ఆలోచిస్తుంటే అనిపిస్తోంది మనం ఏం పంచుకున్నాం? మన భావాలు, అభిప్రాయాలు, ఆలోచనలు ఏం పంచుకున్నాం?. ఇన్నేళ్ళ మన సాహచర్యంలో దగ్గరతనం అనేది ఉందా? ఎప్పుడూ లాభం నష్టం... వాళ్ళదికొన్నారు. మనం ఇది కొందాం... వాళ్ళ మీద వీళ్ళమీద.. వీటిమీదే కదా మన మాటలు... ఇంతకన్నా ట్రాజెడీ ఇంకేం ఉంటుంది?"

ఒక పావుగంట జరిగినవన్నీ విశ్లేషిస్తూ గడిపేశారు మొగుడూ పెళ్ళాలు.

"ఇలా మాట్లాడుకుంటూంటే, ఎంత బావుంది! హాయిగా ఉంది. ఇన్నాళ్ళూ మనిద్దరం కూచుని మనగురించి మాట్లాడుకోలేదు. కానీ, ఫర్వాలేదులే. దేవుడు మనల్ని మనం మార్చుకోడానికి సమయం ఇచ్చాడు. మనకోసం జీవించడానికి అవకాశం కల్పించాడని అనుకుందాం."

మరో గంట పిల్లల చదువులు, ఇంటర్నేషనల్ స్కూలుకి, పబ్లిక్ స్కూలుకి తేడాలు ఎక్కడుంటాయో... వాళ్ళ చదువుల గురించి మాట్లాడుకున్నారు.

"ఏదైనా తింటే బావుండుననిపిస్తోంది. సామానంతా ప్యాక్ చేసేశాం." లేచింది వనజ లోపలికెళ్తూ అంది.

"చూస్తాను... లోపల చుడువా ఏదైనా ఉందేమో!"

"పిల్లలుంచీ ఉండరులే. బయటకెళ్ళి మిరపకాయ బజ్జీలో, సమోసాలో ఏదో తెస్తాను..." అంటూ లేచి షర్టు వేసుకుని వచ్చాడు.

రెండు ప్లాస్టిక్ గిన్నెల్లో, రెండు చెంచాలు వేసి, గదిలో కింద పెట్టింది. తనూ అక్కడే కూచుంది.

"అదేవిటీ? అంత తొందరగా ఏం చేశావ్?" అంటూ షర్టుని విప్పి తలుపుకి తగిలించాడు.

"ఫాస్ట్‌ఫుడ్, చైనీస్ కాదు లెండి మన దక్షిణాది వంటకం. పొద్దున మెస్ వాడిచ్చిన దాంట్లో అన్నం, పెరుగు మిగిలింది నిమ్మకాయ ఊరగాయ వేశాడు. అదే తెచ్చాను" అంటూ నవ్వింది.

రాఘవ తింటూ అన్నాడు...

"సమయం వచ్చింది కాబట్టి చెప్తున్నాను. ఇన్నాళ్ళూ మా ఇంటికి అతిథుల్లాగానే వెళ్ళాం వారం ఉన్నా, నెల ఉన్నా పెద్ద తేడా ఏం లేదు. నీ ప్రవర్తన నాకు తెలుసు. నువ్వు మా అమ్మతో ఎక్కువ మాట్లాడవు. పోనీ అది నీ స్వభావం అనుకుందాం. కనీసం ఇంట్లో ఏ పనిలోనూ కలగచేసుకోవూ. సాయం చేయవు. ఇక మీదట, ఆ ఇల్లు మన ఇల్లు. మీ అమ్మ వాళ్ళిల్లు అని నాతో అనకు. ఆ ఇంట్లో నువ్వు ఓ బాధ్యతాయుత సభ్యురాలివి. అధికారం, హోదా కోసం ప్రయత్నించకు. అవి శాశ్వతం కాదు. హార్మోనీ జీవితాంతం ఉంటుంది.

నువ్వు ఆఫీసులో మాట్లాడినట్లు ఇక్కడ మాట్లాడకు. రెండు వాతావరణాల్లో చాలా తేడా ఉంది. మాటపట్టింపులు రాకూడదు. గొడవలుండకూడదు. ఒక్కసారి తలుపులు మూసుకున్నాయంటే, తెరుచుకోవడం చాలా కష్టం. మనందరికీ ఇప్పుడు కావల్సింది పీస్‌ఫుల్ జీవితం. దానికి నువ్వే ఎక్కువగా పాటుపడాలి. మా అమ్మమీద, నాన్నగారి మీద ఫిర్యాదులు చెయ్యకు, ఇదివరకు నేను విన్నాను కానీ, ఇకమీదట వినను. కొత్త రకమైన జీవితంలోకి అడుగు పెడ్తున్నాం..."

వనజ అలాగే అన్నట్లుగా తలూపింది.

✧ ✧ ✧

ఆ రోజు ఉగాది.

సుమిత్ర, వనజ తలంట్లు పోసుకుని వంటింట్లో రేడియో పెట్టుకుని, పనులు చేసుకుంటున్నారు.

"మమ్మీ..." అంటూ పింకీ వచ్చింది. అత్తాకోడళ్ళు పింకీని చూశారు.

నాలిక్కరుచుకుంది పింకీ.

"సారీ.. సారీ.. అమ్మా.. తాతగారు గమ్ముతో పట్టుపరికిణి వేసుకోమంటున్నారు. గమ్ముతో ఎలా వేసుకుంటారు?"

సుమిత్ర ఫక్కున నవ్వింది. ఈ మధ్యకాలంలో ఆమె అలా నవ్వింది లేదు.

ఈ లోపల రాజారావు వంటింటి గుమ్మం దగ్గరనుంచున్నాడు. భర్తని చూసి నొసలు చిట్లించింది సుమిత్ర.

"ఏవన్నారు మీరు? గమ్ముతో పట్టుపరికిణీ వేసుకోమన్నారా!" నవ్వారు.

"గమ్ముతో పట్టుపరికిణీ వేసుకోమని నేనెందుకంటానే? గమ్మున పట్టుపరికిణీ వేసుకుంటే గుడికెళ్దాం, బజారెళ్దాం అని అన్నాను..."

టీవి చూస్తున్న రాఘవ విని తనలోతనే నవ్వుకున్నాడు.

"భడవా! గమ్మున అంటే గం కాదు. త్వరగా... క్విక్... జల్దీ అని అర్థం... తెలిసిందా? ఏఁవిటో తెలుగు పదాలే తెలీడంలేదు... అన్నీ నేర్పించాలి..."

పింకీ పట్టుపరికిణీ వేసుకోడానికి వెళ్ళిపోయింది. సుమిత్ర నవ్వుకుంటూ బొబ్బట్లకోసం సెనగపప్పు ఉడికించడానికి తాపత్రయ పడ్తోంది. వనజ పింకీ వెనకాలే వెళ్ళింది పరికిణి, జాకెట్టు వేసుకోడంలో సాయపడ్డానికి.

"పెట్టు... మామ్మా... అదేదో స్పెషల్ పచ్చడి పెట్టు..." అంటూ అరుస్తూ లోపలికొచ్చాడు పింటూ.

"అంత గట్టిగా అరవడం ఎందుకు? ఉగాది పచ్చడి పెట్టమని మెల్లగా అడిగితే నీ సొమ్మేం పోయింది?" వనజ లోపలికొస్తూ అంది.

కొత్తగా కొన్న పెద్ద వెండి గిన్నెలోంచి ఉగాది పచ్చడి తీసి ఓ చెంచాతో వాడి చేతిలో వేసింది. సగం కారిపోగా, ఆ మిగిలిన సగం తిన్నాడు.

ఎంతో ఉత్సాహంగా, ఆదుర్దాతో నోట్లో వేసుకున్న మరుక్షణం తల, నోరు, మొహం, మెడ అష్టవంకర్లూ తిప్పాడు.

"ఏంటి మామ్మా! ఈ స్పెషల్ ఇలా ఉందేంటీ? ఏం బాలేదు..." రాఘవ గబగబా లోపలికొచ్చేశాడు.

"మరీ ఎక్కువ వేపపువ్వు వేశావా ఏంటమ్మా? ఇప్పటికే చేదు భరించలేక పోతున్నాం. బెల్లం బాగా వెయ్యి..."

"అలాగే... బెల్లం వెయ్యమంటే వేస్తాను. రేపట్నించి రోజులు బావుంటాయేమో చూద్దాం..." బెల్లం పొడిని పచ్చడి గిన్నెలో వేసింది.

"గుళ్ళో పంచాంగం చదువుతారు. మేము వెళ్తున్నాం. వచ్చేప్పుడు పెద్ద బాలశిక్ష కొనుక్కొస్తాం. పిల్లలకి నేర్పించినట్లు మనకి రివిజన్ అవుతుంది" అంటూ రాజారావు మనవలిద్దర్నీ తీసుకెళ్ళారు.

పాతవి అన్నీ మర్చిపోయిన సుమిత్ర, తన చిన్నప్పటి విషయాలు గలగలా చెప్పేస్తూ... వంట చేసేస్తోంది. వనజ వింటూ కూరలు తరుగుతోంది.

*ఆంధ్రభూమి దినపత్రిక, 17 జనవరి 2010*